సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 5 । మార్చి । 2024



అయోధ్యకు తరలిన భక్తులు
జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని భక్తులు సోమవారం ప్రత్యేక రైలులో అయోధ్యకు తరలివెళ్లారు.
- 9లో ▸



ఫిర్యాదులను పరిష్కరించాలి
ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /18.8

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తగ్గవచ్చు.

పాతాళం వైపు..



వేసవి రాకముందే భూగర్భంలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. భూగర్భజలాలు క్రమంగా పాతాళం వైపు పయనిస్తున్నాయి. నెల వ్యవధిలోనే రెండు మీటర్ల లోతుకు పడిపోయాయి. దీంతో బోరుబావులు ఎత్తిపోతున్నాయి. నీరందక పంటలు ఎండుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

- పడిపోతున్న భూగర్భ జలాలు
- నెలరోజుల్లో రెండు మీటర్ల లోతుకు..
- ఎత్తిపోతున్న బోరుబావులు
- ఎండుతున్న పంటలు
- యాసంగిలో తప్పని సాగునీటి కష్టాలు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. జనవరి నెలాఖరులో సరాసరిన 10.95 మీటర్ల లోతులో లభ్యమైన నీరు.. ప్రస్తుతం 12.92 మీటర్ల లోతుకు పడిపోయింది. గతేడాది ఇదే సమయంలో 11.5 మీటర్ల లోతులో భూగర్భ జలాలుండడం గమనార్హం. అంటే గతేడాదికన్నా ప్రస్తుతం 1.42 మీటర్ల కిందికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

జిల్లాలో గతేడాది సాధారణ వర్షపాతంకన్నా 40 శాతం అదనంగా వర్షాలు కురవగా.. ఈసారి సాధారణ వర్షపాతమే నమోదైంది. వానకాలం తర్వాత వరుణుడు పూర్తిగా ముఖం చాటేయడంతో భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతూ వస్తోంది. జిల్లాలో 80 ఫీజో మీటర్ల పరిధిలో ప్రతినెల భూగర్భజల శాఖ అధికారులు నీటి మట్టం లెక్కలు తీస్తుంటారు. తొమ్మిది మండలాల్లో 20 మీటర్లకుపైగా లోతులోకి భూగర్భ జల మట్టం పడిపోయింది. లింగంపేట, భిక్కనూరు, దోమకొండ, తాడ్వాయి, నాగిరెడ్డిపేట, బిచ్కుంద, రాజంపేట, బీబీపేట, మాచారెడ్డి తదితర ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలు మినహా మిగతా ప్రాంతాల్లో నిరాశాజనక పరిస్థితి ఉంది. కన్కల్‌లో 34.69 మీటర్లు, గుర్జాల్‌లో 30.60 మీటర్లు, పెద్ద దడ్గిలో 33.34, మల్లుపల్లిలో 28.35, బంజార తండాలో 27.67, కన్నాపూర్‌లో 23.80, అన్నారంలో 23.42, సిద్దాపూర్‌లో 22.45, అంచనూర్‌లో 21.18 మీటర్ల లోతులో భూగర్భ జలాలున్నాయి.

పంటలకు కష్టకాలం..

యాసంగిలో జిల్లాలో 2.31 లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. జిల్లాలో లక్షా 9 వేల పైచిలుకు వ్యవసాయ బోర్లు, బావులు ఉన్నాయి. వాటి కిందనే ఎక్కువ భాగం వరి సాగవుతోంది. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో వరి పొట్ట దశలో ఉంది. ఇలాంటి కీలకమైన సమయంలో పంటకు నీరు పుష్కలంగా అవసరం ఉంటుంది. అయితే బోర్లలో నీటిమట్టం పడిపోవడంతో పంట దెబ్బతింటోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇతర పంటలకు కూడా ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి.



ఎత్తిపోతున్న బోర్లు

భూగర్భజలాలు అడుగంటుతుండడంతో సాగునీటి కష్టాలు తలెత్తుతున్నాయి. బోరుబావులు ఎత్తిపోతుండడంతో పంటలకు నీరందించడం కష్టంగా మారుతోంది. బీబీపేట, భిక్కనూరు, దోమకొండ, మాచారెడ్డి, సదాశివనగర్, తాడ్వాయి, రాజంపేట, లింగంపేట, గాంధారి, బిచ్కుంద, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో వందలాది బోర్లు ఎత్తిపోయాయి. యాసంగి పంటలు సాగు చేసిన రైతులు బోర్లు ఎత్తిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు తవ్విస్తున్నారు. బోర్లలో నీరు పడకపోవడంతో పలువురు తీవ్రంగా నష్టపోతున్నారు. కొందరు రైతులు పంటలను వదిలేస్తున్నారు. మరి కొన్నిచోట్ల పంటను కాపాడుకునేందుకు బోర్లు తవ్విస్తున్నారు. నాలుగు వందల అడుగుల నుంచి ఐదు వందల అడుగుల లోతు తవ్వినా బోర్లు పడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్ల తవ్వకానికి అప్పులు చేయాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. కళ్ల ముందే పంటలు దెబ్బతింటుంటే గుండె తరుక్కుపోతోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎండుతున్న పంట.. జీవాలకు మేత

రామారెడ్డి: భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో బోరుబావులు ఎత్తిపోతున్నాయి. దీంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. బోరు ఎత్తిపోతుండడంతో చేసేదేమీ లేక పంటను వదిలేస్తున్నారు. రామారెడ్డి మండలంలోని ఇసన్నపల్లి గ్రామానికి చెందిన కందూరి మల్లయ్య యాసంగిలో రెండెకరాలలో వరి సాగు చేశాడు. బోరులోంచి నీరు సరిగా రాకపోవడంతో ఇప్పటికే ఎకరంపైనే పంట ఎండిపోయింది. ఎండిన పంటలో పశువులను, జీవాలను మేపుతున్నాడు.

నీళ్లు పడుతలేవు..



రెండున్నర ఎకరాల్లో జొన్న వేసిన. బోరు ఎత్తిపోవడంతో పంట ఎండుతోంది. పంటను కాపాడుకునేందుకు వారం కింద మూడు బోర్లు వేయించిన.. ఒక్కదానిలోనూ నీళ్లు రాలే. బోర్ల తవ్వకానికి రూ. లక్ష, పంట సాగుకు రూ. 90 వేలు ఖర్చయ్యాయి. పెట్టుబడులు మీదపడ్డయి.
– సుబ్బూరి సాయిలు, రైతు, మంగ్లూర్

పంట ఎండినా కౌలు ఇవ్వాల్సిందే..



రెండున్నర భూమిని కౌలుకు తీసుకొని జొన్న పంట వేసిన. జొన్న చేతికి వచ్చే సమయంలో రెండు బోర్లలో నీళ్లు తగ్గడంతో నీరందక పంట ఎండుతుంది. ఒక్కసారిగా ఇలా అవుతుందని అనుకోలేదు. కష్టం పోయింది. కౌలు భారం మీద పడుతోంది. ప్రభుత్వం ఆదుకోవాలి.
– పొల్కం సాయిలు, కౌలు రైతు, మంగ్లూర్

పొదుపుగా వాడుకోవాలి

జిల్లాలో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్న తక్కువ నీటిని కూడా పొదుపుగా వాడుకోవాలి. లేకపోతే మరిన్ని ఇబ్బందులు తప్పవు.
– సతీష్‌యాదవ్, జిల్లా భూగర్భజల శాఖ అధికారి

కేజీబీవీలో బియ్యంలో పురుగులు

ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి



నానబెట్టిన బియ్యంను పరిశీలిస్తున్న న్యాయమూర్తి నాగరాణి

భిక్కనూరు: జంగంపల్లిలోని కేజీబీవీని సోమవారం సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి సందర్శించారు. మధ్యాహ్న భోజనం కోసం నానబెట్టిన బియ్యం పరిశీలించారు. బియ్యంలో పురుగులుండడాన్ని గమనించి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం భిక్కనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో గల అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట పారాలీగల్ వలంటీర్లు సంతోష్‌రెడ్డి, నరేశ్, రాజు తదితరులు ఉన్నారు.

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌కు పదవీ గండం ఏర్పడింది. 15 మంది డైరెక్టర్లు సంతకాలతో కూడిన లేఖను సోమవారం జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ విషయమై సోమవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కాగా మెజారిటీ డైరెక్టర్లు బీఆర్ఎస్‌లోనే ఉన్నప్పటికీ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడం గమనార్హం. అవిశ్వాసానికి మద్దతుగా పలువురు డైరెక్టర్లు ఇప్పటికే క్యాంపునకు వెళ్లినట్లు తెలిసింది.

అవిశ్వాస తీర్మాన లేఖను అందుకున్న డీసీవో శ్రీనివాస్ త్వరలోనే డీసీసీబీ పాలకవర్గ సమావేశం నిర్వహించే అవకాశాలు ఉన్నాయి. ఒకవేళ డీసీసీబీ చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాసానికి మెజారిటీ సభ్యులు మద్దతు తెలిపితే భాస్కర్‌రెడ్డి తన చైర్మన్ పదవిని కోల్పోతారు.

న్యూస్‌రీల్

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



కామారెడ్డి క్రైం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా జడ్జి ఎస్ఎన్ శ్రీదేవి సూచించారు. సోమవారం కోర్టు హాలులో మహిళా దినోత్సవ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఉదయం యోగా, సాయంత్రం జిల్లా కోర్టు నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ శాఖల సమన్వయంతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం సీనియర్ సివిల్ జడ్జి నాగరాణితో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బావయ్య, డీపీఎం సుధాకర్, మెప్మా పీడీ శ్రీధర్, డీసీపీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆశ్రమ పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక పరీక్ష

కామారెడ్డి క్రైం: సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లిలోగల ఆశ్రమోన్నత పాఠశాలలో ఐదో తరగతిలో ప్రవేశం కోసం బుధవారం జిల్లా స్థాయి ఎంపిక పరీక్ష నిర్వహించనున్నారు. ఈ విషయమై జిల్లా గిరిజనాభివృద్ధి ఇన్‌చార్జి అధికారి రజిత సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా గాంధీ స్టేడియంలో బుధవారం ఫిజికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చూపినవారికి ఈనెల 21 న హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపిక పరీక్ష ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల 9 నుంచి 11 ఏళ్లలోపు బాలబాలికలు ఎంపిక పరీక్షలకు హాజరు కావాలని, ఇతర వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కామారెడ్డి క్రైం: బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ తదితర పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 5 నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారు బుధవారంలోగా రాష్ట్ర స్టడీ సర్కిల్‌కు చెందిన వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణకు ఎంపిక చేయడం కోసం ఈ నెల 10 న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైనవారికి ఈనెల 18 నుంచి ఆగస్టు 17 వరకు నిజామాబాద్‌లోని షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ శాఖలో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. బోధన, ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు రూ.1,500ల విలువైన స్టడీ మెటీరియల్ కూడా అందిస్తామని తెలిపారు. గతంలో శిక్షణ పొందినవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు.

ఏటీఆర్‌సీలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో గల యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏటీఆర్ సెంటర్) కేంద్రంలో పలు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు కేటగిరీలలో ఒక్కో పోస్టును కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బన్సీలాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు 15 రోజులలో జిల్లా ఆస్పత్రిలో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

గుండెపోటుతో ఖైదీ మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సారంగపూర్ శివారులో గల జిల్లా జైలులో అండర్ ట్రయల్ ఖైదీ గుండెపోటుతో మృతి చెందినట్లు జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ తెలిపారు. సోమవారం ఉదయం 5 గంటల సమయంలో తిరుపతయ్యను తోటి ఖైదీలు నిద్ర లేపగా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో జైలు సిబ్బందికి సమాచారం ఇవ్వగా జైలు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే తిరుపతయ్య గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం చద్మల్‌తండా సమీపంలోని ఎర్రకుచ్చుప్రాంతానికి చెందినవాడు. రెండు కేసులలో జైలుకు వచ్చాడు.

హెచ్‌ఎంబీ రోడ్డు విస్తరణకు శ్రీకారం!

- నేడు సంగారెడ్డి జిల్లాలో శంకుస్థాపన చేయనున్న ప్రధాని మోదీ
- రూ. 9 వందల కోట్లతో పనులు

సాక్షి, కామారెడ్డి: హైదరాబాద్ నుంచి ఎల్లారెడ్డి, బాన్సువాడ మీదుగా బోధన్ వెళ్లే (హెచ్‌ఎంబీ) రహదారి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్ నుంచి మెదక్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తయ్యింది. మెదక్ నుంచి ఎల్లారెడ్డి మీదుగా బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్ వరకు రోడ్డు నిర్మాణానికి రూ. 900 కోట్ల నిధులూ మంజూరయ్యాయి. రోడ్డు విస్తరణ పనులకు మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంగారెడ్డి జిల్లాలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో బోధన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగనుంది.

రెండు బిట్లుగా పనులు

ఎన్‌హెచ్ 765 డీలో మెదక్ జిల్లా కేంద్రం నుంచి నాగిరెడ్డిపేట మండలం మీదుగా ఎల్లారెడ్డి వరకు 44 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి ఒక ప్యాకేజీ కింద తీసుకున్నారు. దీనికి రూ. 400 కోట్లు ఖర్చవుతాయని అంచనా వేశారు. అలాగే ఎల్లారెడ్డి నుంచి బొగ్గు గుడిసె, బాన్సువాడ పట్టణం మీదుగా రుద్రూర్ వరకు 52 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి రూ. 500 కోట్లు మంజూరు చేశారు. రోడ్డు విస్తరణ కోసం భూ సేకరణ ప్రక్రియ చేపట్టారు. దారి పొడవునా ఉన్న పెద్దపెద్ద మర్రి వృక్షాలను తొలగించడంతోపాటు చెరువులు, వాగులు, కాలువల వద్ద వంతెనలు నిర్మించనున్నారు.

బైపాస్‌లు లేకుండానే విస్తరణ

మెదక్ నుంచి రుద్రూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టే క్రమంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట, బాన్సువాడ పట్టణాల మీదుగానే ప్రస్తుతం ఉన్న రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎక్కడ కూడా బైపాస్‌లకు ప్రతిపాదనలు లేవు. బైపాస్‌లు నిర్మించాలంటే పెద్ద ఎత్తున భూ సేకరణ చేపట్టాల్సి ఉంటుంది. భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఉన్న రహదారిని విస్తరించడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మూలమలుపులు సరిదిద్దడంకోసం అక్కడక్కడ భూములు సేకరించాల్సి ఉంటుంది.

తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలి



విద్యార్థికి బహుమతి అందిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: తల్లిదండ్రుల నమ్మకాన్ని పిల్లలు నిలబెట్టుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ఇటీవల జిల్లాస్థాయిలో వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఆయా అంశాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సోమవారం కలెక్టరేట్‌లో రూ. 2 వేల చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. వ్యాస రచన పోటీలో అడ్లూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి.రక్షిత, నినాద పోటీలో బీబీపేట ఉన్నత పాఠశాల విద్యార్థి వి.రేణుక, పోస్టర్ మేకింగ్ పోటీలో అడ్లూర్ పాఠశాల విద్యార్థి కే.శృతిక విజేతలుగా నిలిచి, బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థు లు పొదుపు, చక్రవడ్డీ, డిజిటల్ లావాదేవీలు, బ్యాంకు కార్యకలాపాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రాజు, లీడ్ జిల్లా మేనేజర్ భార్గవ సుధీర్, సమగ్ర శిక్ష సమన్వయకర్తలు వేణుగోపాల్, నాగవేందర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శ్రీధర్ రెడ్డి, విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు సరే.. వేతనాలేవి?

- ఐదు నెలలుగా జీతాలు రాక 104 ఉద్యోగుల అవస్థలు
- ఇతర శాఖల్లో ఉద్యోగుల సర్దుబాటు
- వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 90 మంది ఉద్యోగుల ఎదురుచూపులు



బాన్సువాడ : గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవలందించిన 104 వ్యవస్థకు ప్రభుత్వం రెండేళ్ల క్రితం మంగళం పలికింది. అయితే 104 వాహనాల్లో పనిచేసిన ఉద్యోగులను వివిధ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేసిన ఉన్నతాధికారులు వారికి జీతాలు చెల్లించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నా, వేతనాల చెల్లింపును పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది అక్టోబర్ నుంచి..

గతేడాది అక్టోబర్ నుంచి వేతనాలు అందకపోవడంతో ఇంటి అద్దె, కుటుంబ పోషణకు ఉద్యోగులు ఇబ్బందులు పడుతూ అప్పులపాలవుతున్నారు. 104 వాహనాల్లో విధులు నిర్వర్తించిన ఉద్యోగులను రెండేళ్ల కిత్రం వైద్య ఆరోగ్య, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. ఒక్కో వాహనంలో ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్ సేవలందించేవారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 1300 మంది, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 90 మంది విధులు నిర్వర్తించారు. 2022 జనవరిలో 104 సేవలు రద్దు చేసిన తరువాత సిబ్బందిని ఉమ్మడి వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. గత ఐదు నెలలుగా అసలే వేతనాలు అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తమకు వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆలోచనల నుంచి పురుడుపోసుకున్న 104 సేవలు 2008లో అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గ్రామాల్లో 16 వాహనాల ద్వారా లక్షల మందికి సేవలందించారు.

వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం

ఐదు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. అవుట్‌సోర్సింగ్ వ్యవస్థకు అప్పగించడంతోనే జాప్యం జరుగుతోంది. అప్పట్లో కొందరు తీసుకున్న నిర్ణయాలతో మేం నష్టపోతున్నాం. ఇకనైనా మమ్మల్ని రెగ్యులర్ లేదా పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిలోనైనా మార్చి మా బతుకులకు భరోసా కల్పించాలి. – సాయిబాబా, ఫార్మసిస్ట్, బాన్సువాడ

'గృహజ్యోతి' కోసం మండల పరిషత్ ముట్టడి



నిరసన తెలుపుతున్న సదాశివనగర్ గ్రామస్తులు

సదాశివనగర్: గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధి చేకూరని వారు ఆందోళన చెందుతున్నారు. తమకు ఎందుకు వర్తింపజేయలేదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. సోమవారం సదాశివనగర్‌వాసులు పలువురు మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ జీరో బిల్లు రాలేదన్నారు. అందరికీ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో సంతోష్‌కుమార్ మాట్లాడుతూ గృహజ్యోతి దరఖాస్తుల స్వీకరణ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఇబ్బంది అవుతోందన్నారు. జీరో బిల్లులు రాని వారు మండల పరిషత్ కార్యాలయానికి వస్తే రిజిస్టర్‌లో వివరాలను నమోదు చేసుకుంటున్నామని పేర్కొన్నారు. వివరాలను పరిశీలించి అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి విద్యుత్ క్రీడలు ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ ఉద్యోగులు నిరంతరం ఒత్తిడితో కూడిన విధులు నిర్వహిస్తున్నారని, వీరికి మానసిక ఉల్లాసానికి క్రీడలు అత్యవసరమని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రాష్ట్రస్థాయి ట్రాన్స్‌కో ఇంటర్ సర్కిల్ ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలను ముఖ్యఅతిథిగా హాజరై వరుణ్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో క్రీడా స్ఫూర్తితో ఆడాలన్నారు. ఎస్ఈ రవీందర్, రాష్ట్ర స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, రమేష్ బాబు, కామారెడ్డి సూర్య నరసింహారావు, స్పోర్ట్స్ సెక్రెటరీ గోపి, కోశాధికారి ఉత్తం, తోట రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

సౌత్‌క్యాంపస్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె నోటీస్

భిక్కనూరు : ఉద్యోగ భద్రతతో పాటు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మె చేయాలని యోచిస్తున్నారు. సోమవారం ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్‌కు నోటీస్ అందజేశారు. 17 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ విధులు నిర్వహిస్తున్నామన్నారు. యూనివర్సిటీ కోసం విలువైన భూములు ఇచ్చామన్నారు. తమకు న్యాయం చేయాలని, శ్రమకు తగిన వేతనాలు ఇవ్వాలని కోరారు. గతంలో ఇచ్చిన సమ్మె నోటీస్‌ను అనుసరించి మంగళవారం నుంచి సమ్మె చేయనున్నట్లు తెలిపారు.



సౌత్‌క్యాంపస్ ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

క్లుప్తంగా

ఉద్యోగాలు సాధించాలనే తపన ఉండాలి



కామారెడ్డి అర్బన్ : చదువుకున్న అనంతరం పక్కా ప్రణాళికతో ఉద్యోగాలు సాధించాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలని కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే విజయ్‌కుమార్ అన్నారు. టీఎస్‌కేసీ, టాస్క్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు తొలిమెట్టు అభిరుచి నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మోటివేటర్ బట్టు రఘుతేజ మాట్లాడుతూ నాలుగు రోజుల శిక్షణ విద్యార్థుల ఉన్నతికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు ఫర్హీన్ ఫాతిమా, అజారొద్దీన్, అధ్యాపకులు ఆర్.శ్రీలత,సుచరణ్, అఫ్రీన్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘం ఎన్నికలు రద్దు చేయాలి



కామారెడ్డి టౌన్ : జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కొందరు మత్స్య సహకార సంఘం సభ్యులు సోమవారం ఆందోళన చేశారు. జిల్లా కేంద్రంలోని పట్టణ గంగపుత్ర సంఘ భవనంలో ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోటీ చేసే అభ్యర్థులకు గుర్తింపు చిహ్నాలను ప్రకటించారు. అయితే ఎన్నికల్లో పోటీకి నామినేషన్లు వేసిన 14 మంది సభ్యులను అనర్హులని ప్రకటిస్తూ నోటీస్ బోర్డుపై ప్రకటించడం సరికాదని సభ్యులు ధర్నా చేపట్టారు. ఈనెల 9న జరిగే ఎన్నికలను అడ్డుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సాయిబాబా, శంకర్, సాయిలు, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

అలరించిన మహాశివరాత్రి నృత్యోత్సవం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి కళాభారతిలో ఆదివారం రాత్రి వరకు నిర్వహించిన మహాశివరాత్రి నృత్యోత్సవం పలువురిని అలరించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నృత్య కళాకారులు పాల్గొన్న ఈ నృత్యోత్సవంలో వేద విద్యానంద స్వామి, గాయకులు భిక్షునాయక్, సుజశ్రీలు ముఖ్యఅతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.మనోహర్‌రావు, సనాతన సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు ఎం.నవీన్, చౌకి రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముందు నుంచి బైక్ చోరీ

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన బొర్ర నరేశ్ ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గతంలో బైక్‌లలో నుంచి పెట్రోల్ దొంగిలించారని, ఇప్పుడు ఏకంగా బైక్‌ను ఎత్తుకెళ్లారని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతోనే తరచూ చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని అంటున్నారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ప్రజావాణికి 72 ఫిర్యాదులు

కామారెడ్డి క్రైం : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాతులను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పరిష్కార మార్గాలు చూపాలని , లేని పక్షంలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 72 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో వాటిలో 35 ఫిర్యాదులు భూ సమస్యలకు సంబంచించినవి కాగా, 7 డబుల్ బెడ్‌రూం ఇళ్లు, 13 పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు నమోదయ్యాయి. మిగితావి ఆయా శాఖలకు చెందినవి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ కొలతలు, ధరణి, భూ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారమయ్యే భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. లేదా పరిష్కార మార్గాలు చూపాలని సూచించారు. వాజ్యానికి సంబంధించిన సమస్యలుంటే కోర్టును ఆశ్రయించాలన్నారు. అంతేగానీ సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ఫిర్యాదుదారులు మళ్లీ మళ్లీ ప్రజావాణికి వచ్చేలా చేయకూడదని మండల, డివిజన్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, జెడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఆయా శాఖల జిల్లా అధికారులు, రాజారాం, దయానంద్, శ్రీనివాస్, సింహారావు, సురేందర్ కుమార్, శ్రీధర్ రెడ్డి, భార్గవ్ సుధీర్, కలెక్టరేట్ ఏవో మస్రూర్ అహ్మద్, తహసాల్దార్ ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్



ప్రజావాణికి తరలివచ్చిన జనం

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కామారెడ్డి టౌన్ : పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు రాజనర్సు మాట్లాడుతూ గత ఆర్నెళ్లుగా బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి విద్యార్థులకు కార్మికులు భోజనం అందిస్తున్నారన్నారు. జిల్లాలో సుమారు రూ. 15 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్‌కు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు వెంకటిగౌడ్, వెంకటేశ్వర్లు, సోమలింగం, సత్తయ్య, ప్రవీల, భారతి, సరస్వతి తదితరులున్నారు.

వీల్‌చైర్ ఉన్నా.. సేవలు సున్నా..



కామారెడ్డి టౌన్ : కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చే దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా వీల్ చైర్ సౌకర్యం ఏర్పాటు చేశారు. కాని వీల్‌చైర్ ఉన్నప్పటికీ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వృథాగా పడి ఉంది. కార్యాలయంలోకి ఎంట్రీ కాగానే డోర్ పక్కన ఆ వీల్ చైర్‌ను ఉంచారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు ఇచ్చేందుకు వచ్చిన కొందరు దివ్యాంగులు కూడా వీల్ చైర్ ఉన్నా వినియోగించుకోలేక ఇబ్బందులు పడ్డారు.

హక్కులు, చట్టాలపై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

కామారెడ్డి క్రైం : సమాజంలో మహిళల రక్ష ణకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమాధికారి బావయ్య అన్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన సోమవారం కామారెడ్డి లోని మంజీరా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, డ్రాయింగ్, రంగోలి పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ బావయ్య మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ సాధికారతను సాధిస్తున్నారని కొనియాడారు.

ప్రభుత్వాలు అందిస్తున్న శిక్షణ, ఆర్థిక సహాయాన్ని, అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆపద సమయంలో టోల్ ఫ్రీ నెంబర్లను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, మహిళా సాధికారిక కేంద్రం సిబ్బంది శిరీష, సౌందర్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, షీ టీం, సఖి టీం బృందాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీటీం



కామారెడ్డి టౌన్ : మహిళలకు, విద్యార్థినులకు పోలీస్ శాఖ షీ టీం అండగా ఉంటుందని, ఫిర్యాదు చేసిన వెంటనే సమస్యకు పరిష్కారం చూపుతామని కామారెడ్డి షీటీం ప్రతినిధి సౌజన్య తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మంజీరా డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులు ధైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గురువేందర్, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, డైరెక్టర్ సురేష్ గౌడ్, షీటీం సభ్యులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

బీబీపేట : కెనరా బ్యాంకు అధ్వర్యంలో నిర్వహించిన ఫైనాన్షియల్ లిటరసీ వీక్ 2024లో జిల్లా స్థాయి స్లోగన్ కాంపిటీషన్ పరీక్షలో బీబీపేట టీఎస్ఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వి రేణుక జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో ఆమెకు సోమవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్ రూ. 2 వేల నగదు అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చి పాఠశాలకు మంచి పేరు తెచ్చినందున ఉపాధ్యాయ బృందం అభినందించింది. డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

శివస్వాముల పల్లకీసేవ



భిక్కనూరు : మండల కేంద్రంలో శివ స్వాములు పల్లకి సేవ ఊరేగింపు సోమవారం నిర్వహించారు. వాహనంపై లింగంను ప్రతిష్టించి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. శ్రీసిద్ధరామేశ్వరాలయం మహంత్ సదాశివ మహంత్, శివస్వాములు, రామదండు ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైస్‌మిల్లులో అగ్నిప్రమాదం



కాలిన సంచులను పరిశీలిస్తున్న ఎస్సై సాయికుమార్

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని సప్తగిరి రైస్‌మిల్లులో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం సంభవించినట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. రైస్ మిల్లులోని ప్యానల్ బోర్డు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి 48,200 బర్దాన్ సంచులు, 114 క్వింటాళ్ల బాయిల్డ్ రైస్, 15హెచ్‌పీ, 5హెచ్‌పీ మోటార్లు కాలిపోయాయని రైస్‌మిల్లు యజమానులు ఫిర్యాదు చేశారన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేసినట్లు ఎస్సై తెలిపారు.

డబ్బుల విషయంలో కత్తితో దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని గంజ్ ప్రాంతం రైల్వేలైన్ వద్ద సోమవారం కత్తిపోట్ల ఘటన చోటు చేసుకుంది. డబ్బుల విషయంలో ఖండోబా, దస్తగిరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో దస్తగిరి ఖండోబాపై కత్తితో దాడి చేశాడు. గాయాలపాలైన ఖండోబాను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఖండోబా బతుకుదెరువు కోసం కొంత కాలం క్రితం మహారాష్ట్ర నుంచి నిజామాబాద్‌కు వచ్చినట్లు తెలిసింది. మూడో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండురోజుల జైలుశిక్ష

భిక్కనూరు: మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయమూర్తి రెండు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా విధించినట్లు ఎస్సై సాయికుమార్ సోమవారం తెలిపారు. పాల్వంచ మండలకేంద్రానికి చెందిన వ్యక్తి మద్యం సేవించి బైక్ నడుపగా కేసు నమోదు చేశామన్నారు. కామారెడ్డి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి సదరు వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ.200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రుద్రూర్: కోటగిరి శివారులోని గుట్ట ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఏడుగురి సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. పట్టుబడ్డవారి నుంచి రూ.19,640 నగదు స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతపండు దొంగతనం కేసు నమోదు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో చింతపండు దొంగతనం చేయడానికి వచ్చి దాడి చేసిన వారిపై కేసునమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నిజాం చక్కెర కర్మాగారం ఆవరణలోని చింత చెట్టు కాయలను దొంగిలించేందుకు గుర్తు తెలియని వ్యక్తులు రాగా, వాచ్‌మెన్ అడ్డుకున్నాడు. సదరు వ్యక్తులు వాచ్‌మెన్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆగని వన్యప్రాణుల వేట

- చర్చనీయాంశమైన అన్నారం ఘటన
- పేలింది అడవి పందులను వేటాడే గొలా
- తనిఖీలు నిర్వహించిన బాంబ్ స్క్వాడ్



అన్నారంలో తనిఖీలు చేస్తున్న బాంబు స్క్వాడ్

రామారెడ్డి: మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్న పేలుడు ఘటనకు అడవి పందులను వేటాడేందుకు ఉపయోగించే 'గొలా' కారణమని తెలుస్తోంది. ఈ ఘటనతో పోలీసులు అప్రమత్తమయ్యారు. పేలుడు సంభవించిన దండుగుల రవీందర్ ఇంట్లో సోమవారం బాంబ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహించారు. ఇంకా ఏమైనా పేలుడు పదార్థాలు ఉన్నాయేమోనని తనిఖీలు చేసినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు. ఈ ఘటనలో రవీందర్ భార్య శిరిష గాయాలపాలు కాగా, ఆమెను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఇల్లు పాక్షికంగా ధ్వంసమైంది. అయితే, తనిఖీలు నిర్వహించిన పోలీసులు అటవీ జంతువులను వేటాడేందుకు పేలుడు కోసం ఉపయోగించే బ్యాటరీతోపాటు వైరును స్వాధీనం చేసుకున్నారు. అదే ఇంట్లో చిన్నసైజు బోనుతోపాటు వల ఉన్నట్లు తెలిసింది. మాచారెడ్డి రేంజ్ అధికారిణి దివ్య 'అన్నారం' ఘటనపై స్పందించారు. అటవీ జంతువుల వేట చట్ట ప్రకారం నేరమని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యథేచ్ఛగా వేట?

అటవీజంతువుల వేట యథేచ్ఛగా కొనసాగుతోందని అన్నారం ఘటన మరోసారి రుజువుచేసింది. మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట, సింగరాయపల్లి, అన్నారం శివార్లలోని అటవీప్రాంతంలో జంతువుల వేట జోరుగా సాగుతున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. ఏడాది క్రితం సింగరాయపల్లి అటవీ ప్రాంతంలో వేటకు వెళ్లి బండరాళ్ల మధ్యలో రాజు అనే వ్యక్తి ఇరుక్కున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అయినప్పటికీ అటవీశాఖ అప్రమత్తం కావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.లక్షా 40వేలకు.. రూ.11కోట్లు!

- 'జెనిక్యూ' కాయిన్ పేరుతో టీచర్ల దందా
- దుబాయి కేంద్రంగా చలామణి అవుతోందని ప్రచారం
- సీపీకి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న బాధితుడు



ఖలీల్‌వాడి: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయులు 'జెనిక్యూ' కాయిన్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బిట్‌కాయిన్ తరహాలోనే జెనిక్యూ ఉంటుందని ప్రచారం చేస్తూ ముగ్గురు టీచర్లు జిల్లాలో పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. వివిధ మండలాల్లో పని చేస్తూ ఆ ముగ్గురు టీచర్లు స్నేహితులు, సహోద్యోగులు, బంధువులను నమ్మిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమకు డబ్బులు చెల్లిస్తే ఐడీ, పాస్‌వర్డ్ ఇప్పిస్తామని, ఐదేళ్లలో రూ.లక్షా 40 వేలకు రూ.11కోట్లు, రూ.70వేలు చెల్లిస్తే రూ.5.50 కోట్ల రిటర్న్స్ వస్తాయని నమ్మబలుకుతున్నారు. ఆ టీచర్లను నమ్మి పలువురు డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. 2022 నుంచి ముగ్గురు టీచర్లు జెనిక్యూ కాయిన్ దందా చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంకు చెందిన ప్రభుత్వ ఉద్యోగి శేఖర్‌బాబు తాను చెల్లించిన డబ్బులను తిరిగి ఇవ్వాలని కాయిన్ దందా చేస్తున్న టీచర్లను కోరగా, ఐదేళ్ల వరకు డబ్బుల కోసం ఆగాల్సిందేనని తెగేసి చెబుతున్నారు. తనకు డబ్బులు తిరిగి ఇవ్వకుంటే కమిషనర్ ఆఫ్ పోలీస్‌ను ఆశ్రయిస్తానని బాధితుడు అంటున్నాడు.

ఎన్నికల హామీలను నెరవేరుస్తాం

- అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి
- బోధన్, ఎడపల్లి మండలాల్లో 'గృహజ్యోతి' ప్రారంభం



బోధన్ మండలంలోని సంగంలో బిల్లింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్‌రూరల్/ఎడపల్లి(బోధన్): ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తామని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ మండలం సంగం గ్రామంతోపాటు ఎడపల్లి మండల కేంద్రంలో గృహజ్యోతి పథకాన్ని ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. సంగంలో తానే స్వయంగా మీటర్ రీడింగ్ తీసి వినియోగదారుకు జీరో బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్య శ్రీ,, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ హామీలను అమలు చేస్తున్నామని, త్వరలోని పూర్తి స్థాయిలో ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజలకు అండ నిలుస్తామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సుదర్శన్‌రెడ్డి ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆలయంలో 101 కొబ్బరికాయలు కొడతానని ఎడపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బొబ్బిలి శ్రీనివాస్ మొక్కుకున్నాడు. విద్యుత్ శాఖ డివిజన్ అధికారి మహ్మద్ ముక్తార్, ఏడీ లక్ష్మణ్‌నాయక్, ఏఈ నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, తహసీల్దార్ ధన్వల్, ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో సుభాష్ చంద్రబోస్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ రజితాయాదవ్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మనాల మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, సింగిల్ విండో చైర్మన్ మాల్కారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా 'కారుణ్య' పోస్టు

- వైద్యారోగ్యశాఖలో పదకొండేళ్లుగా కొనసాగుతున్న ఉద్యోగి
- తమ దృష్టికి రాలేదంటున్న డీఎంహెచ్‌వో



శ్రీకాంత్ సమర్పించిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్

నిజామాబాద్‌నాగారం: నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి వైద్యారోగ్యశాఖలో ఉద్యోగి విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా భద్రాచలం మండలం తోటపల్లికి చెందిన సదరు ఉద్యోగి ప్రస్తుతం రెంజల్ మండలంలోని సాలూర పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మచ్చ సత్యనారాయణ వైద్యారోగ్యశాఖలో హెల్త్ విజిటర్‌గా విధులు నిర్వర్తిస్తూ మరణించాడు. ఆయనకు మొదటి భార్య స్వరూపారాణి గృహిణి కాగా, భద్రాచలం మండలం గౌరీదేవిపేట పీహెచ్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వాణిని సత్యనారాయణ రెండో వివాహం చేసుకున్నారు. ఆమె ఇప్పటికీ ఉద్యోగంలో కొనసాగుతున్నట్లు తెలిసింది. అసలు కథ ఇక్కడే మొదలైంది.. గృహిణి అయిన స్వరూపారాణికి ఇద్దరు కొడుకులు శ్రీకాంత్, చరణ్‌తేజ కాగా, రెండో భార్యకు ఇద్దరు పిల్లలున్నారు. నిబంధనల ప్రకారం కారుణ్య పద్ధతిలో ఉద్యోగం పొందాలంటే ఇంట్లో ఒక్కరికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగం ఉండి, సదరు ఉద్యోగి మరణిస్తే వారసులు అర్హులు. అయితే సత్యనారాయణతోపాటు ఆయన రెండో భార్య సైతం ప్రభుత్వ ఉద్యోగులైనప్పటికీ.. ఎలాగైనా తన తండ్రి ఉద్యోగం పొందాలని ప్రయత్నాలు మొదలుపెట్టిన శ్రీకాంత్ తన తండ్రికి ఒక భార్య, నలుగురు సంతానమని నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించాడు. దానితోపాటు నకిలీ ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్‌ను సృష్టించి 2013 నవంబర్ 26న భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్‌వో (ట్రైబల్)లో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరాడు. 2022లో నిజామాబాద్ జిల్లా సాలూర పీహెచ్‌సీకి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతిపై వచ్చాడు. అక్రమ వర్క్ ఆర్డర్లు, డిప్యుటేషన్‌పై మళ్లీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వెళ్లినప్పటికీ, డిప్యుటేషన్లు రద్దు కావడంతో తిరిగి సాలూరకు వచ్చాడు. సదరు ఉద్యోగి వ్యవహారంపై ఇప్పటికే జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు 104 డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేసగాని శంకర్ తెలిపారు. ఇదిలా ఉండగా, శ్రీకాంత్ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించి అక్రమంగా ఉద్యోగంలో చేరినట్లు తమ దృష్టికి రాలేదని డీఎంహెచ్‌వో సుదర్శన్ తెలిపారు. పూర్తి సమాచారం తెలుసుకుంటానని అన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో సోమవారం ఇద్దరు మృతి చెందారు. కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో తొర్లికొండకు చెందిన వ్యక్తి, లారీని ఓవర్ టేక్ చేసి వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొనగా జక్రాన్‌పల్లికి చెందిన మరొకరు ప్రాణాలు కోల్పోయారు.

కారు బోల్తాపడి ఒకరు..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



సాయిప్రశాంత్ (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ గ్రామ శివారులో కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన ఏలేటి సాయిప్రశాంత్(27) అనే వ్యక్తి మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. తొర్లికొండకు చెందిన సాయిప్రశాంత్ తన బావ నవీన్‌తో కలిసి ఆర్మూర్‌కు వెళ్తుండగా, కారు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లి రెండు పల్టీలు కొట్టింది. సాయి ప్రశాంత్‌కు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా, కారు నడుపుతున్న నవీన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు నడిపిన నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బైక్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో..

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి 44వ నంబర్ జాతీయ రహదారిపై కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో జక్రాన్‌పల్లికి చెందిన షేక్ కరీం(58) మృతి చెందాడు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. షేక్‌కరీం సోమవారం జక్రాన్‌పల్లి నుంచి ఆర్మూర్‌వైపు ద్విచక్రవాహనంపై నిఖిల్‌తో కలిసి వస్తుండగా, వెనుక నుంచి లారీని ఓవర్‌టేక్ చేసి వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన కరీంను 108 అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్వల్పగాయాలపాలైన నిఖిల్ ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.